క్లుప్తంగా

ట్రాఫిక్‌కు అంతరాయం



గొమ్మూరు వద్ద నిలిచిన ట్రాఫిక్

బూర్గంపాడు: మండల పరిధిలోని గొమ్మూరు వద్ద ఆర్టీసీ బస్సు బ్రేక్‌డౌన్ కావడం (బ్రేకులు పూర్తిగా కిందకు దిగిపోవడం)తో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. రాజమండ్రి వెళ్తున్న ఆర్టీసీ బస్సు గొమ్మూరు వద్దకు రాగానే బ్రేక్ డౌన్ అయింది. దీంతో బస్సు నడిరోడ్డుపై నిలిచిపోయింది. వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. సుమారు గంటపాటుపై ట్రాఫిక్ నిలిచిపోవటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పోలీసులు, ఆర్టీసీ అధికారులు అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి

భద్రాచలంటౌన్: ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో ఆర్టీసీ కార్మికులపై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ మజ్దూర్ యూనియన్ భద్రాచలం డిపో కార్యదర్శి పోకల సురేష్ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. ఏపీలోని కావలి ఏపీఎస్‌ఆర్టీసీ డ్రైవర్ బి.ఆర్ సింగ్‌పై దాడి మరువక ముందే ఖమ్మం పట్టణంలోభద్రాచలం డిపో డ్రైవర్ నాగేశ్వరరావుపై జరిగిన దాడికి యాజమాన్యం తక్షణమే స్పందించి కార్మికులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్మికులపై దాడి చేసిన దుండగులపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మణుగూరురూరల్: ఆర్టీసి కార్మికులపై విచక్షణారహితంగా దాడులకు పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని టీఎంయూ మణుగూరు డిపో కార్యదర్శి ఎ.కృష్ణ సోమవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖమ్మంలో భద్రాచలం డిపోకు చెందిన డ్రైవర్ నాగేశ్వరరావుపై పలువురు దాడికి పాల్పడి టిఫ్ మిషన్ పగుల గొట్టి బయటకు విసిరేశారని అన్నారు. ఆర్టీసీ కార్మికులపై జరిగిన దాడులను ప్రజలు, ప్రజాస్వామిక వాదులు తీవ్రంగా ఖండించాలన్నారు. ఆయా సంఘటనలపై ఆర్టీసీ సంస్థ స్పందించి దాడులకు పాల్పడిన దుండగులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

యువకుడికి పాముకాటు



చంపిన పామును ప్లాస్టిక్ కవర్లో వైద్యశాలకు తీసుకొస్తున్న స్నేహితుడు

భద్రాచలంఅర్బన్: పినపాక నియోజకవర్గ పరిధిలోని బూర్గంపాడు మండలం అంజనాపురం గ్రామానికి చెందిన భూక్య సంపత్ అనే వ్యక్తిని ఆదివారం పాము కాటేసింది. సదరు వ్యక్తిని భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. పాముకాటు విషయం తెలుసుకున్న అతని స్నేహితుడు ఆవేశంతో ఆ పామును చంపేశాడు. ప్లాస్టిక్ సంచిలో వేసుకుని ఆస్పత్రికి తీసుకొచ్చాడు. ఆ పామును వైద్యులకు చూపించి స్నేహితుడికి తగిన వైద్యం చేయాల్సిందిగా కోరాడు. ఈ ఘటనకు సంబంధించి వీడియో సోమవారం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో ఈ విషయం బయటకు తెలిసింది.

నవంబర్ 2న సమావేశం

మణుగూరుటౌన్: పీవీకాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో నవంబర్ 2న టీబీజీకేఎస్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించనున్నట్లు, ఈ సమావేశానికి టీబీజీకేఎస్ రాష్ట్ర నాయకత్వం హాజరవుతున్నట్లు బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వి.ప్రభాకర్‌రావు అన్నారు. సోమవారం జయశంకర్ భవన్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో, సింగరేణి ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేసేందుకు కార్మిక వర్గాన్ని చైతన్య పరిచి సమన్వయ దిశగా అడుగులు వేసేందుకు దిశా నిర్దేశం చేయడం జరుగుతుందన్నారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా టీబీజీకేఎస్ రాష్ట్ర నాయకుడు వెంకట్రావ్, మిర్యాల రాజిరెడ్డి, కెంగర్ల మల్లయ్య హాజరవుతారన్నారు. సమావేశానికి ప్రత్యేక అతిథులుగా ఎమ్మెల్యే రేగా కాంతారావు, మహబూబాద్ ఎంపీ మాలోత్ కవిత హాజరవుతారన్నారు. నాయకులు అబ్దుల్ రవూఫ్, వీరభద్రయ్య, కాపా శివాజీ, వర్మ, వెంకటేశ్వర్‌రెడ్డి, బానోత్ కృష్ణ, అశోక్, అన్ని గనుల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఆదివాసీల అరణ్యరోదన

- రెండు సార్లు గండిపడిన చెరువు
- ఓ సారి సొంత ఖర్చులతో మరమ్మతులు
- ఈ సారి డీలాపడ్డ స్థానికులు
- నీరులేక ఎండిపోతున్న పొలాలు



ఎర్రంపాడు గ్రామంలో గండి పడిన చెరువు..

చర్లరూరల్: అడవినే నమ్ముకుని జీవిస్తున్న తమ కష్టాలు తీరేదెన్నడో అని ఎర్రంపాడు గ్రామస్తులు గగ్గోలు పెడుతున్నారు. అడవితోనే ముడిపడివున్న తమ జీవితాలను పట్టించుకునే నాథుడే కరవయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం ఎన్నికలప్పుడు మాత్రమే మేము ఉన్నామని గుర్తించి ఓట్లను అడిగేందుకు వచ్చి మళ్లీ మేము గుర్తుకు రామని రోదిస్తున్నారు.

స్వతహాగా చెరువు నిర్మాణం..

ఎర్రంపాడు గ్రామంలో సుమారు 50 కుటుంబాల వారు తరతరాలుగా నివసిస్తున్నారు. ఎంతో కాలంగా వీరు నీటి కష్టాలు పడ్డారు. పశువుల తాగు నీటికి, పంటల సాగుకు అవస్థలు పడ్డారు. ఈ నేపథ్యంలో సమస్యను పరిష్కరించుకునేందుకు వారంతా ఒక్కటయ్యారు. అందులో భాగంగా సుమారు 7 సంవత్సరాల క్రితం ఇంటింటా కొంత డబ్బులు సేకరించారు. మొత్తం రూ.4 లక్షల 50 వేలు పోగు చేసి గ్రామం సమీపంలో చెరువును నిర్మించుకున్నారు. కోకోరాజు చెరువుగా పిలుచుకున్నారు. అప్పటి నుంచి చెరువు నీటితో కళకళలాడుతూ ఉంది.

రెండుసార్లు గండి..

చెరువు నిర్మాణం దగ్గర నుంచి సాఫీగా సాగుతున్న తరుణంలో 2021లో కురిసిన భారీ వర్షాలకు కష్టపడి నిర్మించుకున్న చెరువుకు భారీ గండి పడింది. దీంతో ఆదివాసీల కష్టమంతా అడవిలో కొట్టుకుపోయినట్టైంది. తమ పశువులను, కొద్దిపాటిగా ఉన్న పంటలను కాపాడుకునేందుకు మళ్లీ గ్రామస్తులంతా కలిసి 2022లో రూ.లక్షా 50 వేలు పోగుచేసి గండిని పూడ్చారు. అయినప్పటికీ వారి కష్టానికి ఫలితం లేకుండా పోయింది. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు మళ్లీ చెరువుకు గండి పడింది. దీంతో ఎర్రంపాడు గ్రామస్తుల ఆవేదన అరణ్య రోదనగా మారింది. ఈ ఏడాది తినడానికి కూడా పంట పండే విధంగా లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికలప్పుడే గుర్తొస్తాం..

'మేము ఉన్నామని, ఇంకా బతికేవున్నామని ఎన్నికలప్పుడు మాత్రమే ప్రభుత్వాలకు, రాజకీయ పార్టీల నాయకులకు గుర్తుకొస్తాం'అని ఎర్రంపాడు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో తరాలుగా ఇదే గ్రామంలో ఉంటున్నామని, తమ సమస్యలను పట్టించుకునే నాథుడే కరవయ్యారని వాపోతున్నారు. తమకు ఓటరు కార్డు, ఆధార్ కార్డు, రేషన్ కార్డులను ఇచ్చిన ప్రభుత్వం.. తమను ఎస్టీలు గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలు తమ విషయంలో ఒక్కటి నెరవేర్చడం లేదని కన్నీటిపర్యంతం అవుతున్నారు.

చెరువు గండిని పూడ్చాలి



ఎంతో కష్టపడి నిర్మించుకున్న మా గ్రామంలోని కోకోరాజు చెరువుకు మళ్లీ గండిపడింది. దానిని పూడ్చాలని ప్రభుత్వాన్ని కోరుచున్నాను. ఇప్పటికే రూ.6 లక్షలు ఖర్చు చేశాం. ఇక మా వల్ల కావడం లేదు. దయచేసి పశువులను, ఎండిపోతున్న పంటను కాపాడాలని మనవి.

– దూది బుద్రయ్య, స్థానికుడు

సమస్యలపై దృష్టి పెట్టండి..



మా ఎర్రంపాడు గ్రామంలో అనేక సమస్యలు ఉన్నాయి. గ్రామానికి సరైన రోడ్డు మార్గం లేక అనేక ఇబ్బందులు పడుతున్నాం. అత్యవసర సమయంలో ఆస్పత్రికి వెళ్లాలంటే ప్రయాణం కష్టతరంగా ఉంది. ఒక్కోసారి ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు.

– సోడి రాజు, స్థానికుడు

ఆదివాసీలుగా పుట్టడమే తప్పా?



అడవితల్లిని నమ్ముకుని జీవిస్తున్న తమ సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. ఆదివాసీలుగా పుట్టడమే మేము చేసిన తప్పా? ఈ కారణం చేతనే నాయకులు అభివృద్ధి పనులు చేపట్టడం లేదా? మా భవిష్యత్ తరాలను ఎస్టీలుగా గుర్తించాలి.

– మడివి ఇడమయ్య, స్థానికుడు

భద్రాచలం చేరిన 'ప్రచార రథాలు'



భద్రాచలం: ప్రచార రథాలకు పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ తాతా మధు, తెల్లం వెంకట్రావ్

భద్రాచలం: భద్రాచలం నియోజకవర్గ అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్సీ తాతా మధు అన్నారు. బీఆర్‌ఎస్ భద్రాచలం నియోజకవర్గ అభ్యర్థి తెల్లం వెంకట్రావ్ గెలుపు కాంక్షిస్తూ ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచార రథాలు సోమవారం భద్రాచలానికి చేరుకున్నాయి. వీటికి ఆర్టీసీ ఇన్‌గేట్ వద్ద నున్న కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆ వాహనాలతో మధు అధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వాహనాలతో పార్టీ ఎన్నికల కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం ప్రచారంలో భాగంగా రిటైర్డ్ ఎంప్లాయిస్ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయం, ఇతర ప్రాంతాలకు వెళ్లి కరపత్రాలను పంచి ఓట్లను అభ్యర్థించారు. ఈ ప్రచారంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చర్లరూరల్: రాబోయే ఎన్నికల ప్రచారానికి ఉపయోగించే ప్రచార వాహనాలకు చర్ల ఆయిల్ బంకు ఏరియాలోని అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద సోమవారం బీఆర్‌యస్ పార్టీ నాయకులు పూజలు చేశారు.చర్ల మండలానికి రెండు వాహనాలను కేటాయించినట్లు పార్టీ మండల అధ్యక్షుడు సోయం రాజారావు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి పోలిన లంకరాజు,ప్రచార కార్యదర్శి కొటేరు శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ కోదండ రామయ్య, సర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు, దొడ్డి తాతారావు, కాపుల నాగరాజు, ఇర్పవడ్ల రాము, కాకి అనిల్, బోళ్ళ వినోద్, ఆలం ఈశ్వర్, దొడ్డి సూరిబాబు, గూడపాటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ ఏర్పాట్లు పరిశీలన

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట నియోజకవర్గ రిటర్నింగ్ కార్యాలయంలో వద్ద రక్షణ ఏర్పాట్లను సోమవారం సీఐ కరుణాకర్ పరిశీలించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నవంబర్ 3వ తేదీ నుంచి ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కానున్న సందర్భంగా రక్షణ చర్యలు కోసం కార్యాచరణలో భాగంగా వాహనాల పార్కింగ్, అభ్యర్థితోపాటు వచ్చే ప్రతిపాదిత, మద్దతుదారులు వేచి ఉండేందుకు స్థలాల కేటాయింపు, ప్రహరీ గోడ లేని ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఫెన్సింగ్ ఏర్పాటు చేసేలా నిర్ణయించారు. ఎన్నికల నిబంధనలను అమలు చేసేందుకు ముందస్తుగా ప్రణాళిక చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మదర్స్ గార్డెన్‌పై అవగాహన

గుండాల: మండలంలోని ప్రతీ గర్భిణి ఆరోగ్యాన్నిచ్చే పండ్ల మొక్కలు, కూరగాయలు, ఆకు కూరల మొక్కలను పెంచాలని యాస్పిరేషనల్ భారత్ కొలాబ్రేటివ్ హరిహరన్ అన్నారు. సోమవారం నీతి ఆయోగ్‌లో కార్యక్రమంలో భాగంగా యాస్పిరేషన్ బ్లాక్ చెట్టుపల్లి పంచాయతీలో మదర్స్ గార్డెన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆయా మొక్కలను పెంచడం ద్వారా తల్లులకు, పిల్లలకు న్యూట్రీషన్, మానసిక ఆనందం అందుతుందన్నారు. పంచాయతీలోని గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించి వారి ఇండ్లలో మొక్కలు నాటించారు. విత్తనాలను అందించారు. పంచాయతీ కార్యదర్శి త్రిలోక్, ఎమ్ఎల్‌హెచ్‌పీ లావణ్య, ఏఎన్ఎమ్‌లు అరుణకుమారి, ధనమ్మ, హెచ్ ఎ.బిక్షా, అంగన్‌వాడీ టీచర్ జయమ్మ, సంధ్యారాణి, మంగమ్మ పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలి మృతి

పినపాక: అనారోగ్యంతో ఉపాధ్యాయురాలు మృతి చెందిన ఘటన మణుగూరు మండలంలోని బాంబే కాలనీలో సోమవారం చోటుచేసుకుంది. మణుగూరు మండలం బాంబే కాలనీలో నివాసముంటున్న అనురాధ (40) పినపాక మండలంలోని దుగినేపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుంది. గత కొన్ని రోజులుగా డెంగ్యూ జ్వరంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తుది శ్వాస విడిచారు. ఆమె మృతి పట్ల టీఎస్‌టీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఇంటింటికీ చేరవేయాలి

అశ్వాపురం: గడప గడపనా బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను వివరించి పార్టీ గెలుపునకు కృషి చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ అన్నారు. మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామపంచాయతీలో బూత్ ఇన్‌చార్జ్‌లు, ముఖ్య నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. అమరేందర్ మాట్లాడుతూ.. అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తున్న కాంతారావు కారు గుర్తుపై ఓటు వేయాలని కోరారు. వైస్ ఎంపీపీ వీరభద్రం, గ్రామ శాఖ అధ్యక్షుడు పసుల శివకృష్ణ, నాయకులు గడకారి రామకృష్ణ, ఎస్‌కే.నయీం, లంకెల రమేష్, రాసాల రమేష్, దావ వీరస్వామి, గజ్జి లింగయ్య, శాంతారావు, నరేష్, లోహిత్ యాదవ్, కిరణ్, అశోక్, యాకయ్య, సంపత్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి చెక్కు అందజేస్తున్న భూపతిరావు

భద్రాచలంఅర్బన్: విశ్రాంత ఉద్యోగుల భవనంలో సోమవారం నిర్వహించిన గెట్ టు గెదర్ కార్యక్రమంలో హరితోత్సవ రాష్ట్ర ప్రభుత్వ అవార్డు గ్రహీత డాక్టర్ గోళ్ల భూపతిరావు రూ.10 వేలను విశ్రాంత ఉద్యోగుల సంక్షేమం నిమిత్తం అధ్యక్షుడు భూషణావుకు అందజేశారు.

అదే విధంగా గోళ్ళ భూపతిరావు, దుర్గాప్రసాద్, అజీమ్, రఫీ, భూషణ్ రావులు కలసి రూ.25 వేలు విలువ గల ఇన్వెర్టర్‌ను పెన్షన్ భవనానికి అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు, విశ్రాంత ఉద్యోగులు దాతల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వెంకన్న, హనుమంతరావు, శేఖర్, రఫీ, తహశీల్దార్ కృష్ణ, తులసిదాస్, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

పలు పార్టీల్లో చేరికలు



దమ్మపేట: ఖమ్మంలో తుమ్మల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న దమ్మపేట నాయకులు

సాక్షినెట్‌వర్క్: పలు ప్రాంతాల్లో పదుల సంఖ్యలో కుటుంబాలు పార్టీలు మారాయి. సోమవారం ఇతర పార్టీల నుంచి బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు చేరారు. ఆయా పార్టీల నాయకులు వారికి పార్టీ కండువలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమాల్లో పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టైలర్ మృతికి నివాళి

అశ్వాపురం: మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీలో ఎన్నో ఏళ్లుగా స్వాతి టైలర్స్ పేరుతో తనదైన శైలిలో రాణిస్తూ గుర్తింపు పొందిన బిజగం కోటిలింగం(75) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు.

కోటిలింగం మృతదేహానికి మండల కేంద్రానికి చెందిన వ్యాపారస్తులు, టైలర్ అసోసియేషన్ నాయకులు, పలు పార్టీల నాయకులు, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, మాజీ మండల అధ్యక్షుడు కందుల కృష్ణార్జున్‌రావు, నాయకులు నివాళులర్పించారు.

సభలను జయప్రదం చేయండి

గుండాల: భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాడుతూ ప్రాణాలర్పించిన అమరవీరులను స్మరిస్తూ వచ్చే నెల 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే వర్ధంతి సభలను జయప్రదం చేయాలని న్యూడెమోక్రసి జిల్లా నాయకులు కోరం సీతారాములు, అరెం నరేష్‌లు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామ గ్రామాన ఈ వర్ధంతి సభలను నిర్వహించాలన్నారు. సమావేశంలో ఉప సర్పంచ్ మానాల ఉపెందర్, యాసారపు వెంకన్న, పర్శక రవి, బచ్చల సారన్న, పెండెకట్ల పెంటన్న, లాలు, అజ్గర్, పాయం మల్లన్న, దుగ్గి రియాజ్, నర్సింహరావు, బుచ్చయ్య, వజ్జ ఎర్రయ్య, గొగ్గెల శ్రీను పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు మహాసభ..

భద్రాచలంటౌన్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 18న హైదరాబాద్ కేంద్రంగా జరగనున్న మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని మహాజన సోషలిస్ట్ పార్టీ మండల కన్వీనర్ బొడ్డు సత్యనారాయణ కోరారు. పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలో సోమవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహాజన నేత మంద కృష్ణ మాదిగ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. సమావేశంలో మేకల లత, తెల్లం సమ్మక్క, మిర్యాల రమాదేవి, కంచెర్ల కుమారి, కొప్పుల నాగమణి, గద్దల కృష్ణవేణి, నిర్మలమ్మ, రహీమ, మేరీ పాల్గొన్నారు.

పొత్తు లేకుంటే ఒంటరిగానే పోటీ



సమావేశంలో మాట్లాడుతున్న సాబీర్‌పాషా

బూర్గంపాడు: పినపాక నియోజకవర్గంలో గెలుపోటములను నిర్ణయించటంలో సీపీఐ కీలకమవుతుందని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెతో పొత్తులు కలవకుంటే సీపీఐ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా అన్నారు. సోమవారం సారపాకలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బూర్గంపాడు నియోజకవర్గంలో సీపీఐ అభ్యర్థులు ఐదుసార్లు ఎమ్మెల్యేగా, సమితి ప్రెసిడెంట్‌గా, జెడ్పీ వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారన్నారు. నియోజవర్గంలో సీపీఐకి బలమైన క్యాడర్ ఉందని, రానున్న ఎన్నికలలో సీపీఐ ఏ పార్టీకి మద్దతిస్తే ఆ పార్టీ గెలుస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ముష్పా వెంకటేశ్వరరావు,సారెడ్డి పుల్లారెడ్డి, అలవాల సీతారామిరెడ్డి, సప్కా నాగేశ్వరరావు, పాండవుల బిక్షం, సుబ్బారెడ్డి, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు



వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు

దమ్మపేట: మండల పరిధిలోని పలు గ్రామాల్లో, ముందుగానే పక్వానికి వచ్చిన వరి పంటను, వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సోమవారం క్షేత్ర స్థాయిలో సమగ్రంగా పరిశీలించారు. ఇటీవలే వరి విత్తనాల కల్తీ వలన, పంట నష్టం జరిగిందని మండలంలోని రైతులు వ్యవసాయ శాఖ అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుకు ప్రతిస్పందనగా సోమవారం జిల్లా ఏడీఏ లాల్ చంద్, క్రుషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, కోఆర్డినేటర్లు లక్ష్మీనారాయణమ్మ, శివకుమార్‌లు వరి పంటలను పరిశీలించారు. మండలంలోని దమ్మపేట, మొద్దులగూడెం గ్రామాల్లో ఫిర్యాదు చేసిన రైతుల వరి పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు, విత్తనాల కల్తీ జరిగిందని, దానికి సంబంధించిన నివేదికను త్వరలోనే అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖరరెడ్డి, ఏఈఓ వినోద్, రైతులు పందేటి బుజ్జిబాబు, కుప్పాల శ్రీను, బాల రవి, పందేటి వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

స్థానికతపై విమర్శ తగదు

భద్రాచలంటౌన్: భద్రాచలం నియోజకవర్గానికి ప్రథమ పౌరుడు ఎమ్మెల్యే పొదెం వీరయ్య అని, అటువంటి వ్యక్తిని స్థానికేతరుడు అంటూ ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావ్‌కు స్థానికత అంటే ఏంటో తెలుసా అని టీపీసీసీ సభ్యుడు బుడగం శ్రీనివాస్ ప్రశ్నించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కక్షపూరిత చర్యలకు పాల్పడుతూ నిధులు ఇవ్వకుండా ఇక్కడి ఎమ్మెల్యేను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావ్ రాష్ట్ర కార్యదర్శిగా ఉండి భద్రాద్రి అభివృద్ధికి ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. వరదల సమయంలో భద్రాద్రి ప్రజలు అతాలాకుతలం అవుతుంటే మచ్చుకు కనిపించని వెంకట్రావ్.. ఇప్పుడు ఎన్నికలు వచ్చే సరికి ప్రజల వద్ద మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆరోపించారు. రోజుకొక్క పార్టీ మారే తెల్లం వెంకట్రావ్‌కు ఎమ్మెల్యే పొదెం వీరయ్యను విమర్శించే స్థాయి లేదన్నారు. కార్యక్రమంలో సరేళ్ళ నరేష్, చింతరేల రవికుమార్, అడబాల వెంకటేశ్వరరావు, బలుసు నాగ సతీష్, సుధీర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కార్యాలయం ప్రారంభం



కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న పాయం వెంకటేశ్వర్లు

బూర్గంపాడు: అసెంబ్లీ ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణులు పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే, పినపాక నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మోరంపల్లిబంజరలో పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో పలు కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరాయి. వారికి పార్టీ కండువా కప్పి ఆయన ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను ప్రజలలోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతు కాంగ్రెస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించాలన్నారు.ఆయా కార్యక్రమాలలో పార్టీ నాయకులు తుళ్లూరి బ్రహ్మయ్య, మారం వెంకటేశ్వరరెడ్డి,దుగ్గెంపూడి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి



ఎండిన పత్తి పంటను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు, భద్రాచలం నియోజకవర్గ కోకన్వీనర్ కారం పుల్లయ్యలు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలో సింగవరం పంచాయతీ నాగారం గ్రామంలో ఎండిపోయిన పంట పొలాలను సీపీఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో వేల ఎకరాలు పత్తి చేనులు, వరి పంటలు ఎండిపోయాయని ఎండిన పంటలకు ఎకరానికి 50వేల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తూరుబాక, మారేడుబాక, డి కొత్తగూడెం, సింగవరం పంచాయతీల వరకు తాలిపేరు ఎడమ కాలువ ఉన్నప్పటికీ నీటి సదుపాయం లేక ఇబ్బంది పడుతున్న రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మర్మం చంద్రయ్య, నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు, రైతు సంఘం మండల అధ్యక్షులు బొల్లి సత్యనారాయణ, ఎర్రం మల్లారెడ్డి, అంబటి శ్రీనివాస్ రెడ్డి, రైతులు వేల్పుల పంచమారావు, నిమ్మల మధు, ముర్రం వెంకటేశ్వర్లు, గోవిందు, వేల్పుల సింగయ్య, కాక కామయ్య, ముత్యాలరావు, నాగిరెడ్డి, పూనెం ధర్మయ్య పాల్గొన్నారు.

ముమ్మరంగా పార్టీల ప్రచారం



చర్ల: బత్తినపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు



అశ్వాపురం: బట్టీలగుంపులో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రేగా కాంతారావు

అశ్వాపురం: ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను ఆశీర్వదించి కారు గుర్తుపై ఓటు వేయాలని కోరుతూ.. విప్ రేగా కాంతారావు సోమవారం ప్రచారం నిర్వహించారు. మండల పరిధిలోని కుమ్మరిగూడెం, బట్టీలగుంపు, మిట్టగూడెం గ్రామాల్లో ఓటర్లను కలిసి అభివృద్ధి, సంక్షేమ పథకాలు వివరించారు. ఆయా గ్రామాల్లో అనారోగ్యాల బారిన పడిన పలువురిని ఎమ్మెల్యే రేగా పరామర్శించారు.

మణుగూరురూరల్: బీఆర్‌ఎస్ అభ్యర్థి రేగా కాంతారావును గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ మండల అధ్యక్షుడు ముత్యంబాబు ఆధ్వర్యంలో మండలంలోని రామానుజవరం, కొండాయిగూడెం గ్రామాల్లో సోమవారం ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

చర్ల: మండలంలోని మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాలైన ఎర్రంపాడు, చెన్నాపురం, కిష్టారంపాడు, కమలాపురం, తిప్పాపురం, బత్తినపల్లి, రామచంద్రాపురం గ్రామాల్లో టీపీసీసీ సభ్యులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నల్లపు దుర్గాప్రసాదరావు నేతృత్వంలో సోమవారం కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఆరు గ్యారెంటీలను వివరించి ఓటు వేయాలని అభ్యర్థించారు. నాయకులు కె.విజయకుమార్‌నాయుడు, కారంపూడి సాల్మన్ రాజు, గొంది లీలాప్రసాద్, కల్లూరి నాగేశ్వరావు, వీరభద్రం, గోపాలరావు, చిట్టిబాబు, మల్లయ్య, సోడి నాగేశ్వరావు, రాకేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.